1 St
Happy Work Anniversary.
Year

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 48 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 4 ఫిబ్రవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 4 Februry 2025 PAGES : 8 PRICE : 5/-

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు

- సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి
- కేంద్రం నుంచి ఏపీకి నిధులు ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసు
- కేంద్ర బడ్జెట్ లో ఏపీ పేరు ప్రస్తావించలేదని ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇదే
- అభివృద్ధి ఎవరు చేస్తారో వారికే ఓటు వేయాలని డిల్లీ ప్రజలకు విజ్ఞప్తి
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు



**ఢిల్లీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు ఇవాళ(సోమవారం) 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల - మిగతా3లో



## త్వరలో 100 అమృత్ భారత్ రైళ్లు

- తెలుగు రాష్ట్రాలకు భారీగా కేటాయింపులు
- సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తాం
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- తెలంగాణ నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతాం
- కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- 2026 లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెస్తాం



## ఏపీకి నటుడు సోనూసూద్ 4 అంబులెన్సులు

- 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' ద్వారా అందజేత
- అభినందించిన సీఎం చంద్రబాబు
- ఏపీ సీఎం చంద్రబాబును కలిసి అంబులెన్స్‌లను విరాళంగా ఇచ్చిన సోనూ సూద్
- అమరావతి వచ్చిన సోనూ సూద్
- చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబును సినీ నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. ఏపీ ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ నాలుగు అంబులెన్స్‌లను అందించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన సోనూసూద్.. ఫౌండేషన్ అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం నాలుగు అంబులెన్స్‌లను సీఎం ప్రారంభించారు. మర్యాద పూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.



## నా అమెరికా పర్యటనపై రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం

- రాహుల్ మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు
- బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌లోని సెక్రటరీ, ఎన్ఎస్ఏను కలిసేందుకు వెళ్లాను
- ఆ తర్వాత మన కాన్సుల్ జనరల్ సమావేశానికి అధ్యక్షత వహించాను
- కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్

## నా పోరాటం ఆగదు.. వారిని వదలను



- రఘురామఅసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు
- ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని
- ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నా
- దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉంది
- ప్రభుత్వానికి తాను ఒక బాధితుడిగా పిర్యాదు చేశా

## దేశంలో మకాం వేసిన చైనా

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచన మంచిదే అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది
- ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయింది
- అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసింది

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం



- ప్రైవేటు పాఠశాలలకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి నారా లోకేశ్
- ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని వెల్లడి
- గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత వలన లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలివెళ్లారు

ఏపీలోని ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తియ్యని కబురు చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యాజమాన్యాలతో మంత్రి నారా లోకేశ్ నేడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోటీ పడదాం... అందరం కలిసి విద్యావ్యవస్థను బలోపేతం చేద్దాం అని పిలుపునిచ్చారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైంది. విద్యాశాఖ మంత్రిగా నాపై పవిత్ర బాధ్యత ఉంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత - మిగతా3లో

## పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది

- చెట్టు కింద విద్యార్థులతో మోదీ ముచ్చట్లు..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని
- సరైన రిజల్ట్స్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు
- ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది



# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు

-మొదటిపేజీ తరువాయి

వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.

**ఏపీ చాలా నష్ట పోయింది..**

2014-19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు.

కేంద్రం నుంచి ఏపీకి నిధులు ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావించలేదన్న ప్రతిపక్షాల విమర్శలపై సీఎం స్పందించారు. పేరు ప్రస్తావించనంత మాత్రాన రాష్ట్రానికి నిధులు రానట్లు కాదన్నారు. కొన్ని పథకాలకు ఎప్పటిలాగే నిధులు కేటాయించారని చెప్పారు. "కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన పథకాల నిధులను గరిష్ఠంగా ఉపయోగించుకునే అవకాశం ఏపీకే ఉంది. ఈ మేరకు ఇదివరకే మేం ఆయా రంగాల్లో పాలసీలు తీసుకొచ్చాం. విభజన కన్నా వైకాపా పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. ఈ రెండు అంశాలను ఆర్థిక సంఘానికి వివరించి నిధులు కోరతాం" అని చంద్రబాబు తెలిపారు.

భారత్ అభివృద్ధిని ప్రపంచదేశాలు గమనిస్తున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల దావోస్ పర్యటనలోనూ దీన్ని గమనించానని చెప్పారు. గతంలో ఐటీపై, ఇప్పుడు ఏఐపై దృష్టి పెరిగిందన్నారు. ఏఐ సాంకేతికతలో భారత్ ముందుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లో మన దేశం పేరు




మార్మోగుతోందన్నారు.

"2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుంది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పన్ను సంస్కరణల్లో చాలా మార్పులు జరిగాయి. విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రథమంగా ఏపీలోనే జరిగాయి. ఎంఎస్ఎంఈ పాలసీ గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. దేశంలో పెట్టుబడులకు చాలా మంది ముందుకొస్తున్నారు. పలు రంగాల్లో భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి. నూతన ఆవిష్కరణలతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పెరుగుతోంది. వృద్ధిరేటు పెంచేలా ఈ బడ్జెట్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యవేత్తల్లో భారతీయులే ప్రముఖంగా ఉంటున్నారు.

సమ్మిళిత వృద్ధితోనే అభివృద్ధి సాధ్యం. ఎవరికి ఓట్లు వేస్తే మంచి జరుగుతుందో ఆలోచించాలి. దిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు రాజకీయ కాలుష్యం కూడా ఉంది. అభివృద్ధికి దిల్లీ ఆమడ దూరంలో ఆగిపోయింది. సమస్యల వలయంలో చిక్కుకుంది. అభివృద్ధి కావాలంటే భాజపాకు ఓట్లు వేయాలి. దిల్లీలో భాజపా గెలుపు.. దేశ ప్రగతికి మలుపు. సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి. విభజనతోనే కాదు.. గత ప్రభుత్వ విధ్వంస విధానాలతో ఏపీ పూర్తిగా దెబ్బతింది. విధ్వంసంతో దెబ్బతిన్న రాష్ట్రానికి చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరుతున్నా. మన పరిపాలన బాగుంటే కేంద్రం చేయూత ఇస్తుంది. అప్పుడు ఏపీ అభివృద్ధి పరుగులు తీస్తుంది. అన్ని రంగాల్లో జరిగిన విధ్వంసాన్ని ఇప్పుడిప్పుడే చక్కదిద్దుతు న్నాం అని చంద్రబాబు అన్నారు.

**ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు..**

పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే... అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థలను బలోపేతం దిశగా తీసుకువెళ్లడంలో చంద్రబాబు తీసుకున్న చర్యల గురించి అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

**పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం..**

ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు. బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014-19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం



-మొదటిపేజీ తరువాయి

వలన లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. కరిక్యులమ్ లో మార్పులు తీసుకురావడంతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టాం. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. పాఠశాల విద్యలో సంస్కరణలపై మేం అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతనే ముందుకు వెళు తున్నాం. నేను ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నా. వైసీపీ పాలనలో గందరగోళంగా మారిన విద్యావ్యవస్థను ఛాలెంజ్ గా తీసుకుని పనిచేస్తున్నాం. మేం చిత్తశుద్ధితో చేయాలనే తపనతో ఉన్నాం. విద్యా రంగంలో ప్రైవేటుకు, ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అందరం కలిసి విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం. యువగళం పాదయాత్ర సమయంలో ఉపాధ్యాయుల సమస్యలు అనేకం నా దృష్టికి వచ్చాయి. పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతాం. ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటాం" అని చెప్పారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలిప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచాలని కోరారు. క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడంతో పాటు ఫైర్ సర్టిఫికెట్, స్ట్రక్చరల్ ఎన్వోసీ, శానిటేషన్ సర్టిఫికెట్ మంజూరును సులభతరం చేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడంతో పాటు అర్హత లేని ఉపాధ్యాయులకు డీఎల్ఈడీ చేయడానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు ప్రైవేటు స్కూల్ బస్సులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటి కాలపరిమితి రెండేళ్లు పెంచాలని కోరారు. రాష్ట్రంలో తెలుగు మీడియం ప్రైవేటు పాఠశాలలు 150 వరకు ఉన్నాయని, వాటిని ఇంగ్లీషు మీడియంగా కన్వర్షన్ చేయాలని అభ్యర్థించారు. "బడ్జెట్ స్కూల్స్ కు రుణ సదుపాయం కల్పించాలి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రతిభా పురస్కారాలు అందజేయాలి. ప్రైవేటు స్కూల్స్ ను కేటగిరైజ్ చేసే అంశాలన్ని పరిశీలించాలని సూచించారు. ప్రేవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి క్రీడల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలి. పదో తరగతిలో తిరిగి గ్రేడింగ్ సిస్టమ్ ను తీసుకురావాలి. ఓపెన్ స్కూల్స్ కు కూడా గుర్తింపు గడువును పదేళ్లకు పెంచాలి. ముంపు మండలాల్లో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. స్కూల్ బస్సుల విషయంలో పన్నుల భారాన్ని తగ్గించాలి" అని కోరారు. ఆయా అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవితో పాటు వివిధ ప్రైవేటు స్కూల్స్ అసిసోయేషన్ ప్రతినిధులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

## నా పోరాటం ఆగదు.. వారిని వదలను..



**అమరావతి:** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి తన మనోభావాలు చెప్పాలని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. ప్రతిపక్ష హోదా స్పీకర్, సీఎం ఇస్తారా? ప్రజలు ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌లో పీవీ సునీల్ పాత్రపై రఘురామ స్పష్టంచేశారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు. ప్రభుత్వానికి తాను ఒక బాధితుడిగా పిర్యాదు చేశానని రఘురామ తెలిపారు. శాసన సభ్యుడు ఎవరైనా 60 రోజుల పాటు సరైన కారణం చెప్పకుండా అసెంబ్లీకి రాకపోతే అనార్హత వర్తిస్తుందని... అప్పుడు పులివెందులకు ఉపఎన్నికలు వస్తాయని రఘురామ కృష్ణరాజు చెప్పారు. జగన్ అసెంబ్లీకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. ఈ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని.. దోషులకు శిక్ష పడుతుందని తెలిపారు. గతంలోతాను ఎన్నో ఫిర్యాదులు చేశానని గుర్తుచేశారు. సమాజాన్ని మతాలు, కులాల వారిగా విడగొట్టే విధంగా వైసీపీ నేతలు మాట్లాడారని ఆరోపించారు. సునీల్ కుమార్ అతి తెలివి తేటలు ఉపయోగించి యూట్యూబ్‌లో ఉన్న వీడియోలు తీసేశారని చెప్పారు. ప్రభుత్వానికి తాను ఒక బాదితుడిగా ఫిర్యాదు చేశానని తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిపై ఐపీఎస్ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడారని అన్నారు. సునీల్ కుమార్‌ను ఎప్పుడు సస్పెండ్ చేస్తారని ప్రభుత్వాన్ని అడిగానని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌పై పోరాటం ఆగదని రఘురామ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

**విశాఖపట్నం :** స్థానిక గోపాలపట్నం వెంకటాపురం బీసీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో పలువురు విద్యార్థులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తరగతి గదుల్లో తీవ్ర దుర్వాసన వచ్చింది. దీంతో13 మంది విద్యార్థులకు వాంతులయ్యాయి. అనంతరం వారు కళ్లు తిరిగి కింద పడిపోయారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే స్పందించి.. సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాధితులంతా 8, 9 తరగతుల విద్యార్థులని పాఠశాల సిబ్బంది వెల్లడించారు. విద్యార్థులకు తీవ్ర అస్వస్థతపై జిల్లా ఉన్నతాధికారులు సైతం స్పందించారు. ఈ ఘటనపై వారు ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. అలాగే పాఠశాలలోని తరగతి గదుల్లో అపరిశుభ్రతపై ప్రధాన ఉపాధ్యాయుడితోపాటు సిబ్బందిపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల తరగతి గదులతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు.

# క్రాస్ రోడ్స్‌లో జగన్

**కడప :** గత ఎన్నికల్లో ఘోర ఓటమి. కుదురుకునే లోపు ఒక్కొక్కరుగా నేతల జంప్. నా అనుకున్న వారు దూరం కావటంతో వైసీపీ అధినేత జగన్.. ఆలోచనలో పడ్డారట. కీలకనేతల రాజీనామాలతో.. పార్టీలో స్తబ్ధత నెలకొందట. వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమని క్యాడర్‌కు భరోసా ఇస్తుంటే.. పార్టీ నడిపించటంలో తనకు తోడుగా ఉన్న ప్రముఖులు వీడటంతో వైసీపీ అధినేత ఇరకాటంలో పడ్డారట. విదేశీ పర్యటన ముగించుకుని.. స్వదేశానికి తిరిగొచ్చిన ఫ్యాన్ పార్టీ అధినేత.. రూట్ మ్యాప్ ఏంటనే చర్చ జోరుగా సాగుతోంది. పార్టీని వీడిన నేతల మాటెలా ఉన్నా.. ఉన్నవారిని ఆయన ఎలా కాపాడుకుంటారోననే సస్పెన్స్ నెలకొంది.వైసీపీకి కీలకనేతల.. వరుస రాజీనామాలు షాక్ ఇస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన వారంతా సొంతదారి వెతుక్కోవటం.. జలఖని షేక్ చేస్తోందట. ఫలితాల అనంతరం సైలెంట్ అయిపోయిన లీడర్లు, క్యాడర్.. ఇప్పుడిప్పుడే కోలుకుని బయటకు వస్తున్న తరుణంలో.. నేతల రాజీనామాలు పెద్దదెబ్బగా మారాయట. గత ఎన్నికల ఫలితాలు డిజాస్టర్‌గా మారినా.. రాజ్యసభలో తమకున్న బలంతోనే నెట్టుకురావచ్చుని భావించిన జగన్‌కు.. విజయసాయిరెడ్డి రూపంలో మరో షాక్ తగిలిందని రాజకీయ నిపుణులు చర్చించుకుంటున్నారు. పార్టీకి పెద్దగా ఉన్న వారే ఒక్కొక్కరుగా బయటకు వచ్చేస్తుండటం.. శ్రేణుల్లో అలజడి రేపుతోందట. కోలుకోలేని దెబ్బతిన్న వైసీపీకి.. తిరిగి కంబ్యాక్ తెచ్చేందుకు జగన్ నానా తంటాలు పడుతున్నారని టాక్ నడుస్తోంది.ఎంతమంది నేతలు పార్టీని వీడినా జగన్ మాత్రం ధైర్యంగా ఉన్నారు. పార్టీని రీసెట్ చేసే కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పార్టీ కార్యకర్తలు కూడా బయటకు రావటం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయటంతో.. కాస్తో కూస్తే బెటర్ పొజిషన్ ఉందట. దీంతో మాజీమంత్రులతో పాటు చాలామంది నేతల ప్రెస్‌మీట్‌లతో కాస్త నయం అనుకున్న సమయంలో.. విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటన ఆ పార్టీని ఇరకాటంలో పడేసిందట. తాను మాత్రం జగన్‌కు అన్నీ చెప్పి బయటకు వచ్చానని సాయిరెడ్డి చెబుతున్నా.. పార్టీ అధినేత లేని సమయంలో.. నెంబర్ టూగా చెలామణీ అయిన నేత.. తప్పుకోవటంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.రాజ్యసభలో వైసీపీకి.. 11 మంది సభ్యుల బలం ఉంది. కేంద్రంలో బీజేపీకి అవసరమైన సమయాల్లో ఆ పార్టీ మద్దతు ఇస్తూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం వైసీపీ నుంచి ఆరేడుగురు మంది రాజ్యసభ సభ్యులు రాజీనామాలు చేయబోతున్నారనే ప్రచారం జరిగింది. ఆ ప్రచారానికి బలం చేకూరుస్తూ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామాలు చేసి.. తమ గూడు తాము వెతుకున్నారు. తాజాగా వైసీపీ కీలకనేత, ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటన ఆ పార్టీలో కలకలం రేపింది. రాజ్యసభ సభ్యుడిగా, వైసీపీ కీలక నేతగా, విశాఖ రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకుడిగా.. సాయిరెడ్డి పేరు



తెచ్చుకున్నారు.అందులో మంచి కంటే, చెడు ఎక్కువ ఉందనేది బహిరంగ రహస్యమేననే టాక్ ఉంది. సోషల్ మీడియా వేదికగా.. ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలు చేయడంలోనూ? ఆ క్రమంలో చీవాట్లు తినడంలోనూ విజయసాయిరెడ్డికి సాటి ఇంకెవరూ లేరని పొలిటికల్ వర్గాల్లో చర్చ సాగుతోంది. సడెన్‌గా ఏమైందో కానీ.. వైసీపీని వీడారు విజయసాయిరెడ్డి. గత ఎన్నికల్లో నెల్లూరు నుంచి లోక్ సభకు పోటీ చేసి ఓడిపోయారాయన. తర్వాత కూడా పార్టీలో యాక్టివ్‌గానే ఉన్నా.. సీపీని వీడతారంటూ ప్రచారం జరిగింది. దానిని ఎవరూ నమ్మకపోయినా.. వన్ ఫైన్ డే ఆయన తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.పార్టీ అధినేత జగన్.. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో విజయసాయిరెడ్డి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన బాటలోనే మరో ఎంపీ వైసీపీకి రాజీనామా చేయబోతున్నారంటూ ప్రచారం సాగుతోందట. రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి కూడా వైసీపీకి గుడ్ బై చెప్పబోతున్నారనే ప్రచారం జరిగినా.. ఆయన అలాంటిదేమీ లేదని క్లారిటీ ఇచ్చారు. కానీ జయసాయిరెడ్డి, ఆయోధ్య రామిరెడ్డి సన్నిహితులు కావడంతో ఆయన కూడా రాజీనామా చేసే అవకాశాలు లేకపోలేదని రాజకీయవర్గాల్లో టాక్ నడుస్తోంది. గత ఎన్నికల ముందు వరకు వైసీపీలో కీలకంగా వ్యవహరించిన బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆళ్ల నాని వంటి నేతలు కూడా దూరమయ్యారు. ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు సైలెంట్ అయ్యారు. కొడాలి నాని.. ఇంకా అజ్ఞాతం వీడలేదు. దీంతో.. పార్టీలో అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందట.గతంలో పార్టీ నుంచి అన్నీ ప్రయోజనాలు పొంది. కష్టకాలంలో ఉండాల్సిన నేతలు ఒక్కొక్కరుగా దూరం కావడంపై క్యాడర్ మాత్రం మండిపడుతోందట. కార్యకర్తలకు అండగా ఉంటూ భరోసా ఇవ్వాల్సిన నేతలు వ్యక్తిగత కారణాలతో పార్టీకి దూరం కావటం సరైన నిర్ణయం కాదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయట. మరోవైపు పార్టీని వీడుతున్న నేతలపై జగన్ గతంలోనే స్పందించారు. పోయేవారిని పోనీయండి.. ఉండేవారు ఉంటారు.. వారితోనే రాజకీయం చేస్తానంటూ క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మనదే విజయం అంటూ ధైర్యం చెప్పారు.వారి వారి.. వ్యక్తిగత కారణాలతో వెళ్లిపోయే వారిని బుజ్జగించలేమన్నది జగన్ అభిప్రాయంగా తెలుస్తోంది. బాలినేని శ్రీనివాసరెడ్డి రాజీనామా సమయంలోనూ ఇదే తరహాలో లైట్ తీసుకున్న జగన్.. ఇప్పుడు విజయసాయిరెడ్డి వ్యవహారాన్ని కూడా అలాగే లైట్ తీసుకుంటారా అనేది చర్చనీయాంశంలా మారింది.రాజీనామా ప్రకటనలో జగన్‌ను.. ఒక్క మాట కూడా అనని విజయసాయిరెడ్డి.. తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటన చేశారు. గతంలో ఉన్న కేసులకు తోడు కాకినాడ పోర్టు వంటి కొత్త కేసులు జత కావటం రాజకీయంగా నిర్వేదానికి గురై..ఇలాంటి నిర్ణయానికి వచ్చి ఉంటారని చాలామంది భావిస్తున్నారట. అయితే ఇప్పటికే ఈ అంశంపై జగన్‌కు కచ్చితంగా సమాచారం ఇచ్చే.. తన నిర్ణయాన్ని ప్రకటించి ఉంటారని తెలుస్తోంది. మరి అంశంపై జగన్ రియాక్షన్ ఎలా ఉండబోతోంది. పార్టీలో.. ఈ షాకింగ్.. షేకింగ్‌లను ఆయన ఎలా సెట్ చేస్తారనే ప్రశ్నార్థకంగా మారింది. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన జగన్.. విజయసాయిరెడ్డి రాజీనామాపై ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. మిగిలిన నేతలను కాపాడుకునేందుకు జగన్ ముందున్న వ్యూహాలేంటి అనేది పొలిటికల్ వర్గాల్లో సస్పెన్స్‌గా మారింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపుకు కూటమి నేతలు కృషి చేయాలి

**జగన్‌కు అధికారం ఇస్తే... రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు**

**కోడ్ ముగియగానే మహిళలకు ఉచిత బస్, అన్నదాత సుఖీభవ, మెగా డిఎస్సీ**

**కూటమి ప్రభుత్వ కార్యక్రమాల్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**వైసీపీ అబద్ధాలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలి**

**కూటమి నేతలు అలసత్వం లేకుండా అప్రమత్తతతో ఉండాలి**

**విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 3)



ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం జరిగింది. మంత్రి గొట్టిపాటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమ పెన్షన్ల కోసం అత్యధిక వ్యయం చేస్తున్న రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. వందల కోట్ల రూపాయిలతో రోడ్ల నిర్మాణాలు, మరమత్తులు నిర్వహించామని వెల్లడించారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలతో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమానికి ఒక కొత్త నిర్వచనం చెప్పిందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మహిళలకు ఉచిత బస్ పథకం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయడంతో పాటు మెగా డిఎస్సీ కూడా నిర్వహిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలన్నింటినీ ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని కూటమి నేతలకు, కార్యకర్తలకు మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు.



**ఒక్క అవకాశంతో... అంధకారంలోకి రాష్ట్రం... :** ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన జగన్ ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అంధకారంలోకి నెట్టేసిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. ప్రజలు ఒకసారి జగన్ ను నమ్మి అధికారం కట్టబెడితే... రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను కూడా చెడుగా ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. నిజం నోరు దాటక ముందే అబద్ధం ఊరు దాటుతుందన్న సామెత... వైసీపీ విష ప్రచారాల విషయంలో నిజమవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలతో వైసీపీ నేతలకు నిద్ర కూడా పట్టడం లేదన్నారు. మీడియా, సోషల్ మీడియాల సాక్షిగా వైసీపీ శ్రేణులు చేస్తున్న విష, చెడు ప్రచారాల విషయంలో కూటమి నేతలతో పాటు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పి కొట్టేలా కూటమి నేతలు కూడా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలన్నీ ప్రజల్లోకి మరింత తీసుకు వెళ్లేలా ప్రచారం చేయాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో అతి విశ్వాసంతో ఎవ్వరూ అలసత్వం ప్రదర్శించవద్దని కూటమి నేతలకు మంత్రి హితవు పలికారు. వైసీపీ ఒకసారి అధికారం చేపట్టడం వల్ల జరిగిన తప్పుకు అన్ని విధాలా రాష్ట్రం ఎంతో నష్ట పోయిందన్నారు. మరోసారి ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా ఉండాలంటే కూటమి అభ్యర్థుల గెలుపుకు నేతలంతా కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఇకపై జరగబోయే ప్రతి ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో పాటు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని మేస్త్రీలుగా కొనసాగించాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేసిన ఏఐటీయూసీ జిల్లా నాయకులు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)



ఒంగోలు నగరపాలక సంస్థలో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని మేస్త్రీలుగానే కొనసాగించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. సందర్భంగా యూనియన్ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ. 2003 సంవత్సరం నుండి సుమారు 40 మంది మేస్త్రి లుగా పనిచేసారు. ఎలక్షన్ టైంలో. పరీక్షలు టయాలలో. జీవో నెంబర్ 279 సమయంలో క్లస్టర్ సూపర్వైజర్లు గాను నేటికీ మేస్త్రి లు గానే విధులు నిర్వహిస్తున్నారని, రాష్టం మొత్తం అన్ని మునీ్స పా లిటీ లలో మేస్త్రిలు ఉన్నారని, ఒంగోలు లోనే వీళ్ళనుఅపారని. ఇప్పటి కె 4నెలల నుండి జీతాలు లేక కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారని. సీనియారి టీ ని బట్టి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ కమిషనర్ గారిని 15 రోజులలో వారిని విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు , ఎంఎల్ నారాయణ ఆర్.వెంకట్రావు శ్రీరామ్ శ్రీనివాసులు, కందుల ఆదినారాయణ , సిహెచ్ వెంకటేశ్వర్లు, విజయ వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఖబరస్తాన్‌కు

# కేటాయించిన స్థలాన్ని ముస్లింలకే అప్పగించాలి

**సిపిఐ జిల్లా సమితి డిమాండ్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)




గత ప్రభుత్వ హయాంలో ముస్లింలకు కేటాయించిన ఖబరస్థాన్ స్థలాన్ని ముస్లింలకే కేటాయించాలని సిపిఐ జిల్లా సమితి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ముస్లింల ఖబరస్తాన్ కోసం దశరాజు పల్లి రోడ్డులో గత ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించింది అన్నారు. అందులో భాగంగా ఒంగోలు నగర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా తీర్మానం చేశారన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆ స్థలాన్ని ముస్లింలకు దక్కకుండా కమ్మ సామాజిక వర్గానికి పార్కుగా రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తుందన్నారు. ఒంగోలు నగరంలో 35 వేల మందికి పైగా ముస్లింలు నివసిస్తున్నారని, ఈపాటికి వారికి కొత్తపట్నం రోడ్ లో ఫ్లైఓవర్ కింద ఇచ్చిన రెండు ఎకరాల స్థలం ఖబరస్థాన్ స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎప్పటికైనా ఎమ్మెల్యే దామచర్ల స్పందించి ముస్లింలకు కేటాయించిన రెండు ఎకరాల ఖబరస్థాన్ స్థలాన్ని వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

# అక్రమ బోర్లతో వ్యాపారం పట్టించుకోని అధికారులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)



ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ వడ్డెపాలెం నందు అక్రమ బోర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా కొంత మంది వ్యక్తులు లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా గత కొన్ని సంవత్సరాల నుంచి నీటి మాఫీయా వ్యాపారంతో ఆ ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి అంజి అనే వ్యక్తి కుబేరుడిగా మారాడు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆయన కూడా పార్టీ కండువాలు మార్చుకుంటూ చీకటి వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. అటవీ ప్రాంతంలో జరిగే ఎర్రచందనం వ్యాపారం లా తమ్మిశెట్టి అంజి ఈ నీటి వ్యాపారం సాగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి నిత్యం, ట్రాక్టర్లు, లారీల ద్వారా నీటి సరఫరా చేస్తూ రోజుకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఇదేమని ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తే వారి పై అతను ఉగ్రరూపం దాల్చుతాడు. ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అతనికి హెచ్చరికలు జారీ చేసినా ఎవడైతే నాకేంటి అన్న రీతిలో ఆయన ప్రవర్తన వుందని ప్రచారం సాగుతోంది. మరి ఇప్పటికైనా అతడి పై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులను ఛేదించాలి

**ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ**

**స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతుల పై ఆరా**

**పలు రికార్డుల పరిశీలన**

**మహిళలు, చిన్నారుల పై జరుగుతున్న నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి సారించాలి**

**పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి**

**బాధితులకు న్యాయం చేసేలా కృషి చెయ్యాలి**

**గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)




వార్షిక తనిఖీల్లో భాగంగా గుంటూరు రేంజ్ ఐజీ సోమవారం ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి రిసెప్షన్, లాక్ అప్ రూమ్, ప్రాపర్టీ, స్టోర్ రూమ్, రికార్డు రూ:లను పరిశీలించి ఎఫ్ఐఆర్ ఇండెక్స్, కేసు డైరీలను, రిజిస్టర్లు, పలు రికార్డులన్నీ పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నేర , శాంతి భద్రతల పరిస్థితి, నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతి అడిగి తెలుసుకున్నారు. విచారణ దశలో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, దీర్ఘకాలంగా కేసులు పెండింగ్ లో ఉండుటకు గల కారణాలను సమీక్షించి, క్వాలిటీ ఆఫ్ ఇన్విస్టిగేషన్ తో కేసుల్లో విచారణ వేగవంతం చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులను ఛేదించాలని, ఒక నిర్దిష్ట ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం చేసేలా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో పటిష్ట బీట్ సిస్టంను ఏర్పాటు చేయాలని, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటిని అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ డ్రంక్, డ్రైవ్ టెస్టులు చేపట్టాలని, తీర ప్రాంతాల్లో పటిష్ట గస్తీ ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. (తరువాయి 4లో...)

# సిఐ అజయ్ కుమార్ పై గుంటూరు ఐజికి మాల మహానాడు ఫిర్యాదు

## దళిత బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి సోదరుడి పై దాడి చేసిన జులాయి గ్యాంగ్ పై కేసు నమోదు చేయలేదంటూ ఫిర్యాదు

### కేసు నమోదుకు ఐజి ఆదేశం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

ఒంగోలు కేశవరాజుకుంటలో దళిత బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వారి పై మూడు రోజులుగా తాలూకా సిఐ అజయ్ కుమార్ కేసు కట్టలేదని మాల మహానాడు నాయకులు దారా అంజయ్య, కాకుమాను రవి సోమవారం ఒంగోలు టూ టౌన్ తనిఖీకి వచ్చిన గుంటూరు ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. మేలమ్ శాంతి వర్ధన్ ఆరవ తరగతి చదువుతున్న తన చెల్లెలను స్కూలుకి వచ్చి పోయే సమయంలో, చిల్లర కొట్టుకు వెళ్లే సమయంలో కేశవరాజు కుంటలోని కొంతమంది ఇతర కులస్తులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వారి తల్లిదండ్రులకు చెప్పారు. క్రిస్మస్ ముందు రోజు కేశవరాజు కుంటలోని ఇంటి వద్ద చిల్లర సామాను కోసం పల్లవి అనే ఆమె బంకు వద్దకు తన చెల్లెలు వెళ్లిందన్నారు. అక్కడ బంకు దగ్గరలో టాటా ఏసీ వ్యానులో కూర్చున్న కుర్రవాళ్ళు తన చెల్లెలి చేతిని పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించారని, యూనిఫామ్ పైన ఉన్న చున్ని లాగేసారన్నారు. అలాగే తన చెల్లెలి బుగ్గలు లాగటం, జుట్టు పట్టుకొని లాగటం, రాళ్లు వేయడం చేసేవారన్నారు. కబాడీ ఆటకు వస్తావా, అమ్మ, నాన్న ఆట ఆడుకుందామా అంటూ అసభ్యంగా ప్రవర్తించారన్నారు. అప్పుడు తాను మగ పిల్లల తల్లులైన మల్లేశ్వరి, అరుణ అనువారికి చెప్పామన్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన మల్లేశ్వరి అధికారపార్టీ అహంకారంతో తమ పిల్లలను సమర్థిస్తూ మీకు దిక్కున చోట చెప్పుకోండి, మా పిల్లలు అంతే, వాళ్ళ ఇష్టాన్ని మేము కాదనమని, మీ చేతనైంది చేసుకోమని వారి మగ పిల్లల అరాచకాన్ని, లైంగిక దాడిని సమర్థిస్తూ మాట్లాడారని చెప్పారు. తమకు దిక్కు లేక తగాదాలు ఎందుకులే అని పెద్దమనుషుల సలహాతో బాలిక బంధువులు సైలెంట్ అయ్యారు. ఈ క్రమంలో జనవరి 31వ తారీఖున సాయంత్రం దళిత బాలిక చున్నీని అర్జున్ అనే అతను లాగాడు. మన్ను అనే అతను చున్నీ గాలికి ఎగరేశాడు. కౌశిక్ యూనిఫామ్ డ్రెస్ పట్టుకొని వెంటపడ్డాడు. ఆ బాలిక వారి చెర నుండి తప్పించుకొని ఇంట్లో వాళ్లకు చెప్పింది. వెంటనే వారి బాలిక తల్లి రమణమ్మ కొంటె గ్యాంగ్ తల్లులైన మల్లేశ్వరి నిలదీశారు.

అధికార తెలుగుదేశానికి చెందిన బీసీ నాయకురాలు మల్లేశ్వరి లేబర్ ..... మా ఇంటికి వచ్చి అడిగేంత ధైర్యం ఉందా, మీరు మమ్మల్ని ఏమి చేస్తారు. మీరు కేసు పెట్టిన పోలీసులు తీసుకోరు. మేమే మీ మీద కేసు పెడతామని బెదిరించారని తెలిపారు. మరల బాలిక బంధువులు భయపడి ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి 9:30 సమయంలో పనిమీద రోడ్డు మీదకు వచ్చిన బాలిక సోదరుడు మేళం శాంతి వర్ధన్ ను దళిత బాలికను వేధించిన జులాయి గ్యాంగ్ పవన్ బాబు, కౌశిక్, అర్జున్, మన్ను అను ఐదుగురు వచ్చి మా ఇళ్లకు వచ్చి మమ్మల్ని అడిగే ధైర్యం ఎక్కడిదిరా అంటూ మరో ఆరుగురిని పిలిపించి వారందరూ కలిసి మేళం శాంతి వర్ధన్ ను గొంతు పిసికి కాళ్లు చేతులతో కొట్టారు. తమ బిడ్డను కొడుతున్నారని తప్పించడానికి వచ్చిన మేళం రమణమ్మ, మేడం మంగ, తదితర మహిళలను అరుణ భర్త రాజాతో సహ గుండెల మీద చేయి వేసి దాడి చేశారన్నారు. తెలుగుదేశం మహిళ నేత మల్లేశ్వరి కులం పేరుతో దూషిస్తూ మీ ఇంటికి నిప్పు పెట్టి చంపుతామని బెదిరించారని తెలిపారు. బాధితులు తాలూక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయటానికి వెళ్లారు. వెళ్లే లోపే తెలుగుదేశం పార్టీ నాయకురాలు అయిన మల్లేశ్వరి అధికార పార్టీ నాయకులచే తాలూకా సిఐకు ఫోన్ చేయించుకుందన్నారు. డ్యూటీలో ఉన్న తాలూకా సెక్టార్ 3 ఎస్ఐ అనిత మీరు కొట్టి మళ్ళీ, వాళ్ల మీద ఫిర్యాదు చేయటానికి వచ్చారా అంటూ ప్రశ్నించింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకోకుండా బెదిరించిందన్నారు. తమ ఫిర్యాదు తీసుకోకుండా బెదిరించిందన్నారు. బాధితులు దళిత నాయకులు నీలం నాగేంద్రంను ఆశ్రయించారు. ఒకటవ తారీఖున బాధిత బాలికను తాలూకా సిఐ అజయ్ కుమార్ స్వయంగా విచారించారు. ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాస్‌ను ఫోన్లో సంప్రదించి ఈ కేసు విషయం చెప్పారన్నారు. ఒంగోలు డిఎస్పీ ఆదేశాల మేరకు హుటా హుటిన కేశవరాజు కుంటలోని సంఘటన స్థలానికి వెళ్లి సాక్షులను విచారించారు. శనివారం సాయంత్రం కేసు నమోదు చేస్తామన్నారు. కాని ఉదయం, సాయంత్రం అంటు సోమవారం కూడా కేసు నమోదు చేయలేదు. మీరు వాళ్లకు డబ్బులు బాకీ ఉన్నారని, మీరే వాళ్లని కొట్టారని మీమీద వాళ్ళు ఫిర్యాదు చేసిన కేసు పెడతామని సీఐ బాధితులను హెచ్చరించారన్నారు. ఈ క్రమంలో కేసు నమోదు చేస్తామని స్టేషన్‌కు పిలిపించి ఈ కేసుకు సంబధం లేని మరో తాలూకా ఎస్ఐ పావని చేత కేసు నమోదు చేయకుండా విచారించారన్నారు. అనంతరం నీలం నాగేంద్రం సూచన మేరకు ఒంగోలు వచ్చిన గుంటూరు ఐజి సర్వ శ్రేష్ఠి త్రిపాటికి దళిత బాలిక కేసు నమోదులో తాలూకా సిఐ, ఎస్ఐ అలసత్వ వైఖరి పై మాల మహానాడు నాయకులు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేయాలని ఐజి ఆదేశించారు.

# అల్లినగరం హైస్కూల్లో కన్నుల పండుగలాగా గోల్డ్ మెడల్ ప్రధానోత్సవం

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 3)

కొమరోలు మండలం అల్లినగరం శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అధ్యక్షతన గత విద్యా సంవత్సరంలో 220 రోజులకు 200 రోజులు పైగా పాఠశాలకు హాజరైన ప్రతిభావంతులైన విద్యార్థులకు, నిర్మాణాత్మక మూల్యాంకనం పరీక్షలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానోత్సవం ఆనందోత్సాహాలతో కన్నుల పండుగ లాగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కొమరోలు మండలం రెండవ విద్యాశాఖ అధికారి వెంకటరత్నం హాజరై గోల్డ్ వెండి రాగి పథకాలు ఒలంపిక్ గేమ్స్ లో గెలుపొందిన క్రీడాకారులు పొందడం చూస్తామని అలాంటి గొప్ప కార్యక్రమం అల్లినగరం హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. మరొక ముఖ్య అతిథి రాష్ట్ర జన విజ్ఞాన వేదిక నాయకులు స్వరూప రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆటిట్యూడ్, బిహేవియర్, క్యారెక్టర్, డెడికేషన్, టార్గెట్ ఇవన్నీ కలిగి ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు ప్రతిభావంతులుగా తయారై తను తను ఎంచుకున్న స్థాయిని పొందుతారని స్వరూప రెడ్డి తెలిపారు.



అల్లినగరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ గోల్డ్ మెడల్ బహూకరణ వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడం వలన విద్యాభివృద్ధి క్రమశిక్షణ క్రీడలు ఇలా అన్ని రంగాల్లో రాణించగలరని అందుకే పాఠశాలలో గోల్డ్ మెడల్ ప్రధానోత్సవం ఏర్పాటు చేశానని, గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ వి నారాయణ కోటేశ్వరరావు సుజాత సుజాత చంద్రమోహన్ ప్రకాశరావు శివరాం గురువయ్య సిబ్బంది అశ్విని దేవి ఎర్రగుంట్ల ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రగిరి శ్రీనివాసులు మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.





# యానాదుల జీవితాలలో వెలుగులు నింపాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

సుప్రీంకోర్టు న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు మేరకు ఎస్టీలకు కూడా గిరిజన జనాభా కులగణన జరిపి తద్వారా ఎస్టీ వర్గీకరణ వెంటనే ఏర్పాటు చేసి 14 లక్షల మంది యానాదుల జీవితాలలో వెలుగులు నింపాలని యానాది సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో నాయకులు స్పందనలో కలెక్టర్‌కి వినతి పత్రం అందించారు. తొలుత అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అర్జీ ఇవ్వటం జరిగింది. నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు న్యాయస్థానం ఇటీవల ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నదని తెలియజేయటంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 35





గిరిజన ఉప తెగలు, 40 లక్షలకు పై చిలుకు జనాభా కలిగి ఉన్నారని, అందులో అత్యధికంగా కడు పేదరికంతో 14 లక్షల మంది యానాదులు మాత్రమే ఉన్నారని ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుసుకోవడం జరిగింది. అత్యధిక శాతంగా యానాదులు జనాభా కలిగి, నేటికీ తినటానికి తిండీ, కట్టుకోడానికి సరైన బట్టలు, బ్రతకడానికి జానెడు భూమి, తలదాచుకోవడానికి నీడ, కడుపు నింపుకోవడానికి సరైన ఆహారం లేక కడు దుర్భరమైన జీవితాలలో మగ్గిపోతున్నారు. అనేక సంవత్సరాలుగా యానాదులు కఠిక పేదరికంతో మగ్గిపోతూ, యానాదుల అడ్రస్ ఎక్కడ అంటే గోతం సంచులు చేతపట్టి చిత్తుకాగితాలు ఏరుకొని, వాగుల్లో, వంకల్లో చేపలు పట్టుకొని, పట్టణాల్లో డంపు యార్డులు, ఇతర ఇళ్ళల్లో పాచిపనులు చేసుకుంటూ బ్రతకేవారిగా, చాలీచాలని బతుకులుతో పస్తులుంటూ, నేటికీ సమాజం కంప్యూటర్, టెక్నాలజీ అంటుంటే ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేక, ఈనాటికీ జనాభా లెక్కలలో గుర్తింపులేక పోవటం వారి అడ్రస్గా మారిన దుస్థితి, పరిస్థితి. నేటికీ విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రాజకీయ పరంగా చూసినప్పుడు. ఏ అభివృద్ధికి నోచుకోని వారు ఎవరన్నా ఉన్నారంటే అది కేవలం యానాదులు మాత్రమే. రావాల్సిన కావున మా యానాదుల యొక్క స్థితిగతులు, జీవన విధానాలను గుర్తించి, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్టీ వర్గీకరణ చేసి మా యానాదుల జనాభా నిష్పత్తి ప్రకారం యానాదులకు ఎస్టీ వర్గీకరణ అమలు జరిగేలా చూసి, ప్రభుత్వం నుండి వారికి అవకాశాలు కల్పించి, వారి అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వమని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి యానాది, పొట్లూరి లక్ష్మయ్య, చలంచర్ల ప్రసాద్, రావూరి శ్రీనివాసరావు, బూదూరి సుబ్బారావు, చేవూరి వెంకటేశ్వర్లు, జి కాశి, పుల్లమ్మ, తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

# సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులను ఛేదించాలి

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అరికట్టాలని, పాత నేరస్థులు రిపీటెడ్ అఫెండర్స్ పై నిఘా ఉంచాలని, పెట్టి కేసులను నమోదు చేయాలని, రోడ్డు సేఫ్టీ నియమాలు, సైబర్ నేరాలు, చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్గించాలని



ఆదేశించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా ధైర్యాన్నిచ్చేలా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించినప్పుడు ఎలాంటి నేరాలు జరగకుండా, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందించడం జరుగుతుందని ఐజీ తెలిపారు. గుంటూరు రేంజ్ ఐజి వెంట అడిషనల్ (ఎస్పీ అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు తాలూకా సీఐ అజయ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ సిఐ సుబ్బారావు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

# కనుల పండుగగా అక్షరాభ్యాస కార్యక్రమం

## తొలి అక్షరం దిద్దిన 30 మంది చిన్నారులు

## వసంత పంచమి విశిష్టతను తెలియజేసిన పండితులు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

వసంత పంచమి పర్వదినాన ఒంగోలు నగరంలో ట్రినిటి స్కూల్ యాజమాన్యం సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు కనుల పండుగగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు సోమవారం ట్రినిటి హైస్కూలు ఆవరణంలో 30 మంది చిన్నారులకు వేద పండితులు సమక్షంలో అక్షరంను సంబంధిత తల్లిదండ్రులతో అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా పండితులు వసంత పంచమి విశిష్టతను చిన్నారుల తల్లిదండ్రులకు వివరిస్తూ మాఘమాసం శిశిర ఋతువులో వచ్చే శుక్ల పంచమిని వసంత పంచమి అంటారని, దీనినే శ్రీ పంచమి, మదన పంచమి అనే పేర్లతోనూ పిలుస్తారన్నారు వసంత పంచమి నామాన్ని బట్టి ఇది ఋతు సంబంధమైన పండుగగా భావించాల్సి ఉంటుందని పురాణల ప్రకారం ఋతువుల రాజు వసంతుడని కనుక శిశిర ఋతువులో వసంతుని స్వాగత చిహ్నంగా ఈ పంచమిని భావిస్తారన్నారు.వసంత ఋతువు లక్షణాలు ప్రకృతిలో కనిపిస్తాయని చెట్లు చిగురించడం, పూలు పూయడం వంటి శు భసంకేతాలు ఇదే ఋతువులో ఆరంభమవుతాయని వసంతుడికి ఆహ్వానం పలుకుతూ ప్రకృతి శోభాయమానంగా విరాజిల్లుతుందన్నారు వసంతం ప్రకృతిలోని జీవులన్నిటికీ ఎనలేని ఆనందం కలిగిస్తుందని , వసంత పంచమికి హిందూమతంలో ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని వసంత పంచమినాడే సరస్వతీ మాత జన్మించిన రోజఅని ఈరోజున విద్యారంభ రోజుగా భావించి అక్షరాభ్యాసాలను ట్రినిటి హైస్కూలు ఆవరణంలో గత 25 ఏళ్ళుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారని తెలియజేసారు.అక్షరానికి సరస్వతి అధిదేవతని ప్రణవ స్వరూపిణి, జ్ఞానానంద శక్తి, లౌకిక–అలౌకిక విజ్ఞాన ప్రదాయిని అయినటువంటి శ్రీవాణి కృప లేకుంటే లోకానికి మనుగడే లేదని వాగ్దేవి ఉపాసన వల్ల వాల్మీకి రామాయణ రచన చేశారని, శారద దీక్ష స్వీకరించి వ్యాసుడు వేదవిభజన చేయగలిగాడని పురాణాలు చెబుతున్నాయని తెలియజేసారు వ్యాసుడు గోదావరీ తీరాన సైకతమూర్తి రూపంలో వాణిని ప్రతిష్ఠించాడని పురాణ కథనమని ఆ క్షేత్రమే నేడు వ్యాసపురిగా, బాసరగా ప్రసిద్ధి చెందిందని అందుకే వసంత పంచమి రోజున సరస్వతీ పూజ అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుందన్నారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వందకు పై బడి మూడేళ్లు నిండిన చిన్నారులకు ఉచితంగా పూజ ద్రవ్యాలు,విద్యా పరికరాలు అందజేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు లకు చెందిన తల్లి తండ్రులు తమ చిన్నారులకు పాఠశాల ప్రాంగణంలో అక్షరాలను దిద్దించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పాఠశాల యాజమాన్యంను అభినందించారు

# ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల మ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కూటమి ప్రభుత్వం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యని నియమించడం జరిగింది. అందులో భాగంగా ఫిబ్రవరి 3వ తేదీన విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పట్టుభద్రల బమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి మద్దతుగా విజయవాడ పార్లమెంట్ భవన్ కేశినేని చిన్ని ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. పట్టుభద్రుల అందరూ ఈనెల 27వ తేదిన జరిగే ఎన్నికల్లో పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య కోరారు. ఈ కార్యక్రమంలో మ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న , బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ , మాజీ మ్మెల్యే జలీల్ ఖాన్ , జనసేన నాయకులు రాజేష్ , రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ , ఇతర కూటమి బూత్ మెంబెర్స్, యూనిట్ ఇంచార్జ్స్ పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com